క్లుప్తంగా

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పూసపాటిరేగ: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండల పరిధిలోని కొత్తకొప్పెర్లలో ఆదివారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. 55 మంది ఆర్‌పీఎస్‌ఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. శాంతిభద్రతకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై ఎ.సన్యాసినాయుడు కోరారు.

రామతీర్థంలో వైభవంగా మాసశివరాత్రి పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థాన క్షేత్ర పాలకులైన ఉమా సదాశివాలయంలో మాసశివరాత్రి పూజలు ఆదివారం వైభవంగా జరిగాయి. శివుడికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక హోమాలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రగతి బాట



కొత్తగా నిర్మించిన రహదారి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నెల్లిమర్ల–రణస్థలం ప్రధాన రహదారిలో ఎంబీరేయగుళ్ల సమీపంలో ఉన్న తోటపల్లి కెనాల్ కాలువ నుంచి వల్లూరు గెడ్డ వరుకు పక్కా రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రత్యేక చొరవతో సుమారు రూ.2.85 కోట్ల అంచనా వ్యయంతో ఇటీవల రహదారి పనులు పూర్తిచేశారు. శ్రీకాకుళం–విజయనగరం రెండు జిల్లాలను కలిపే ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో ప్రయాణించేవారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ్మాపురం జంక్షన్ నుంచి టొంపలపేట వరకు రహదారి విస్తరణ పనులను త్వరలోనే పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

జగనన్నతోనే మరింత సంక్షేమం

- ఇంటింటి ప్రచారంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్



రాజాం సిటీ: దోలపేటలో ఎంపీ బెల్లానకు విజయ తిలకం దిద్దుతున్న మహిళ

రాజాం సిటీ: రాష్ట్రంలో ప్రతి కుటుంబ సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌లు అన్నారు. పట్టణ పరిధి డోలపేటలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, కాలనీవాసులు వారికి హారతులిచ్చి, విజయ తిలకం దిద్ది ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ పాలన అందించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేశారని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటింటికి సంక్షేమ పథకాలు అందజేశారని గుర్తుచేశారు. ఈ రోజు ప్రతి అక్కచెల్లెమ్మ మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని కోరుకుంటున్నారని అన్నారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు పాలనలో ప్రజలు ఎన్ని అవస్థలు పడ్డారో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. నేడు కొత్తగా తప్పుడు హామీలతో ఓట్లు అడిగేందుకు టీడీపీ నాయకులు వస్తున్నారని, వారి నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పాలవలస గోపి, గోకవలస బాబూరావు, కెంబూరు నారాయణరావు, శాసపు వేణుగోపాల్, గోకవలస కృష్ణమూర్తి, పొట్నూరు ప్రసాద్, పాలవలస శ్యాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టండి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం



పసపాంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పసపాం, చినపసపాం, ఎరుకొండ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు, యువత అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ప్రతీ గడపలో మహిళలు ఆయనకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని ఎమ్మెల్యే అప్పలనాయుడు ప్రజలకు వివరించారు. పేదలకు జరుగుతున్న మంచిని అడ్డుకునేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూడమిగా ఏర్పడి అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలు ఎటువైపు ఉండాలో నిర్ణయించుకోవాలని సూచించారు. 2014లో బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని, 2019 ఎన్నికల్లో ప్రజలు టీడీపీని పూర్తిగా తిరస్కరించారని గుర్తుచేశారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికలు రావడంతో అవే బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ఇచ్చిన మాటకు కట్టుబడిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని, 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే సంక్షేమం, అభివృద్ధి రెట్టింపు అవుతాయన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పసపాంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కళాకారులతో కలిసి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోలాటం ఆడి వారిని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, సర్పంచ్ వాళ్లె చినతల్లి, ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, దాడిశెట్టి త్రినాథరావు, వాళ్లె సన్యాసినాయుడు, వాళ్లె తాడు, వాళ్లె అచ్చెన్నాయుడు, మొంగం నాగబాబు, జనపాల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో భూములు కొట్టేశారు

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి భర్త లోకం ప్రసాద్ యువతకు కంప్యూటర్ ఉద్యోగాలు ఇస్తామని పేదలను మభ్యపెట్టి ముంజేరు పరిసర ప్రాంతాల్లో భూములను కారుచౌకగా కొట్టేశారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆరోపించారు. ఎరుకొండలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. 20 ఏళ్ల కిందట స్వర్గీయ కొమ్మూరు సంజీవరావు సహకారంతో ముంజేరు, భోగాపురం పరిసర ప్రాంతంలో నిరుపేదల నుంచి భూములను కారుచౌకగా కొట్టేయడంతో పాటు ప్రభుత్వ భూములను కూడా లోకం ప్రసాద్ ఆక్రమించారని అన్నారు. ముంజేరు పరిసర ప్రాంతంలో 20 ఏళ్లుగా ఎలాంటి సేవా కార్యక్రమాలు చేయని లోకం మాధవి నెల్లిమర్ల నియోజకవర్గానికి సేవ చేయడానికి వస్తున్నానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, ప్రజాప్రతినిధిలు మహంతి శ్రీనువాసురావు, మహంతి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- గాజులరేగలో ఇంటింటి ప్రచారం



గాజులరేగలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఐదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓట్లు వేయాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. నగరంలోని గాజులరేగ ప్రాంతంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. పూలమాలలు వేసి, హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించారు. అర్హతే ప్రమాణికంగా.. పూర్తిపాదర్శకతతో సంక్షేమ పాలన అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోలగట్ల కోరారు. తనను శాసన సభ్యుడిగా మరోసారి గెలిపిస్తే.. నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, సుందరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. నగర మేయర్ వి.విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కనుగల రాజా మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఎంతో కృషిచేశారన్నారు. ఆయన్ను గెలిపించుకోవడం ద్వారా నగరాన్ని మరింతగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. గాజులరేగ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా నీటి సమస్య ఉండేదని, మౌలిక సదుపాయాల కొరతతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని, అయితే సమస్యలను కోలగట్ల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే వాటి పరిష్కారానికి చొరవ చూపారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నడిపిల్లి ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, నాయకులు మన్యాల కృష్ణ, జమ్మ మధు, జామాన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెల్లిమర్ల రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని, ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ధర్మరాజు, నగర పంచాయతీ కమిషనర్ బాలాజీ ప్రసాద్ సూచించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని థామస్‌పేట ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో వాకర్లకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో శత శాతం ఓటింగ్ నమోదయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ అన్ని సౌకర్యాలను కల్పించిందన్నారు. ఓటు వజ్రాయుధమని, అందరూ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. 18 ఏళ్లు నిండిన వారు ఈ నెల 15లోగా ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ మూర్తి, నోడల్ అధికారి సూర్యకాంతం, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గెలుపే మా లక్ష్యం



వైఎస్సార్‌సీపీ మాజీ సర్పంచ్‌లు దాసరి చంద్రశేఖర్, లక్ష్మితో సమావేశమైన గుడివాడ గ్రామ వలంటీర్లు

భోగాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపే మా లక్ష్యమని మండలంలోని గుడివాడ పంచాయతీ చెందిన 20 గ్రామ వలంటీర్లు అన్నారు. ఈ మేరకు ఆదివారం వైఎస్సార్‌సీపీ మాజీ సర్పంచ్‌లు దాసరి చంద్రశేఖర్, లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చిల్లా దుర్గ వెంకటలక్ష్మిలను వారి స్వగృహంలో కలిసి నేడు తమ వలంటీర్ పోస్టులకు రాజీనామా చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ గెలుపు కోసం మీ ఉద్యోగాలు రాజీనామా చేసేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో అధికారంలోకి వచ్చేది మన ప్రభుత్వమేనని, ఎవరూ ఎవరికీ భయపడొద్దని వలంటీర్లకు భరోసా ఇచ్చారు.

ద్విచక్ర వాహనాలు దగ్ధం

బాడంగి: మండల కేంద్రం బాడంగిలో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మూడు ద్విచక్ర వాహనాలు కాలిపోయాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రామాలయం పక్కన, శివాలయలం ఎదురుగా గల కొరిపిల్లి అప్పలస్వామి కల్లంలో టైల్స్ గోదాం వెనుక పార్క్‌చేసి ఉంచిన ద్విచక్రవాహనాలు కాలిపోయాయి. పెట్రోల్ లీక్ కావడం, లేదా ఎండ కారణంగా మంటలు రావడంతో కాలిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. అప్పలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఆర్.జయంతి తెలిపారు.

గొడవలకు పాల్పడొద్దు: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణమూర్తి

డెంకాడ: ఎన్నికల సమయంలో వివాదాలకు వెళ్లి కోరి కష్టాలు తెచ్చుకోవద్దని విజయనగరం డీఎస్పీ గోవిందరావు అన్నారు. మండలంలోని జొన్నాడ గ్రామంలో ఆదివారం పర్యటించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా రాజకీయ వ్యాఖ్యలు చేయొద్దని సూచించారు. గొడవలకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. నగదు తీసుకువెళ్లే సమయంలో తగిన ఆధారాలు వెంట ఉంచుకోవాలని, లేకపోతే ఆ డబ్బులను సీజ్ చేస్తామన్నారు. మద్యం, నగదు తరలింపుపై నిఘా పెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలతో తరతరాల అనుబంధం



ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- ఇఫ్తార్ విందులో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లిం సోదురలకు ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుభాకాంక్షలు తెలిపారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ముస్లిం సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ, ముస్లింల మధ్య తరతరాల అనుబంధం, స్నేహ భావం ఉన్నాయన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులో తనను భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ రంజాన్ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు నింపాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రార్థనల అనంతరం ముస్లింలకు విందును వడ్డించారు. అనంతరం ముస్లింలు కోలగట్లను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోలగట్ల తమన్నశెట్టి, శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ నారాయణస్వామి, ధనలక్ష్మి, పట్నాన పైడిరాజు, రహీం, హరీష్, మాలిక్, సులేమాన్, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం

దత్తిరాజేరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి, అవినీతి రహిత పాలన దేశానికే ఆదర్శంగా నిలిచింద ని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం సీఎం జగన్ అమలు చేశారన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల ఆర్థికాభివృద్ధికి నవరత్నాల పథకాలు ఎంతో దోహదపడ్డాయని చెప్పారు. సీఎం జగన్ నెలకొల్పిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయని, విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని అన్నారు. టీడీపీ నాయకుల దుష్ప్రచారాన్ని, మాయమాటలను నమ్మవద్దని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జరగాలంటే సీఎం జగన్‌తోనే సాధ్యమని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. మే 13న నిర్వహించనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

పేదల సొంతింటి కల సాకారం

- అర్హులందరికీ పక్కా గృహాల మంజూరు
- భోగాపురం మండలంలో 1,586 మందికి ఇళ్ల స్థలాలు
- శరవేగంగా నిర్మాణాలు

భోగాపురం మండలంలో లబ్ధిదారుల వివరాలు

మంజూరైన స్థలాలు	1,586
గృహ రుణాల లబ్ధిదారులు	920
పునాది స్థాయిలో ఇళ్లు	588
గోడలు పూర్తయినవి	50
మొత్తం పూర్తయిన ఇళ్లు	250
ఇంకా ప్రారంభించనవి	662



భోగాపురం జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

భోగాపురం: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఇందులో భాగంగా భోగాపురం మండలంలో 1,586 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఇందులో 920 మందికి గృహనిర్మాణ శాఖ ద్వారా రుణాలు కూడా మంజూరు చేశారు. దీంతో భోగాపురం, దల్లిపేట, నందిగాం, చేపలకంచేరు, రావాడ, సవరవిల్లి, ముక్కాం, రామచంద్రపేట, లింగావలస తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి.

రుణంతో పాటు రాయితీలు

పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ శాఖ ద్వారా రూ.1.80 లక్షలు ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. అలాగే రాయితీపై సిమెంట్, ఐరన్‌తో పాటు మూడు ట్రాక్టర్ల ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ఇంటి పునాదులకు రూ.51,200, గోడలు నిర్మిస్తే రూ.53,200, శ్లాబు వేసుకుంటే రూ.22,400, ప్లాస్టింగ్ పూర్తయితే మరో రూ.23,200 నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మహిళ సంఘాల సభ్యులకు అదనంగా మరో రూ.50 వేలు రుణాన్ని ఇస్తున్నారు. జాతీయ రహదారికి సమీపంలో ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు జోరుగా చేపడుతున్నారు.

సొంతింటి కల నెరవేరింది



ఈ ప్రభుత్వ హయంలో నాకు పక్కా ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణానికి కావలసిన సామాగ్రి అందింది. బిల్లులు కూడా బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. జీవితంలో ఇంత త్వరగా ఇల్లు నిర్మించుకుంటానని అనుకోలేదు. సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– పదాల దుర్గమ్మ, దల్లిపేట గ్రామం

అవస్థలు తీరాయి



సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో జీవనం సాగిస్తూ అవస్థలు పడేవాళ్లం. ప్రస్తుత ప్రభుత్వ హయంలో మాకు పక్కా ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం చేపట్టి గృహప్రవేశం చేసుకున్నాం. సొంత ఇల్లు నిర్మించుకోవడం చాలా గర్వంగా ఉంది. సీఎం జగన్ చేసిన మేలును ఎప్పటికీ మరువలేం.

– నడుపూరి సీతమ్మ, భోగాపురం